క్లుప్తంగా

'ఆశవర్కర్లను కాంగ్రెస్ ఆదుకుంటుంది'


మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: ఆశవర్కర్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో సమ్మె చేస్తున్న ఆశవర్కర్లకు శనివారం మద్దతు తెలిపి మాట్లాడారు. కరోనా సమయంలో ఆశవర్కర్లు చేసిన సేవలు అమూల్యమైనవన్నారు. వారి కుటుంబాల గురించి పట్టించుకోకుండా సమాజ సేవకు ముందుకొచ్చారని కొనియాడారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని కోరారు. నాయకులు షేక్ గౌస్, లింగంగౌడ్, దొమ్మాటి నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి, అనవేని రవి, సుడిద రాజేందర్, ఎండీ రఫీక్, రాజునాయక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలు అభివృద్ధి

- మానకొండూరు ఎమ్మెల్యే రసమయి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి

తంగళ్లపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో రూ.3 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి హ్యాట్రిక్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, మండల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయం


నిరసన ప్రదర్శనలో నాయకులు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో శనివారం మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటన సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు, విపక్ష పార్టీల నాయకుల అరెస్టును కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఖండించారు. బీజేపీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసల వెంకటి, బీజేపీ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దీక్షలు..ధర్నాలు

- సిరిసిల్లలో మిన్నంటిన నిరసనలు
- అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు, మధ్యాహ్న కార్మికులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న కార్మికులు, భవన కార్మికులు నిరసనలు హోరెత్తించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న కార్మికులు, భవన కార్మికులు ఆందోళనలు చేపట్టారు.

చెవిలో పూలతో ఆశాల నిరసన

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై సిరిసిల్లలో ఆశావర్కర్లు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈమేరకు శనివారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో దీక్షల శిబిరంలో చెవిలోపూలు పెట్టుకుని నిరసన తెలిపి మాట్లాడారు. పనికి తగిన వేతనాలు ఇవ్వాలని, ఫిక్స్‌డ్ జీతం నెలకు రూ. 18వేలు అందించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై చాలా సార్లు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినా..పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే దిగివచ్చి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ, అన్నల్‌దాస్ గణేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు గుండా థామస్, ఖానాపురం లక్ష్మణ్ తదితరులు సంఘీభావం తెలుపగా..కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య తదితరులున్నారు.

ఇరవై రోజుల దీక్షలో అంగన్‌వాడీలు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ..అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఆర్డీవో ఆఫీస్ ముందు ఏఐటీయూసి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం ఇరవైరోజున నిరసన తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ..వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ జేఏసి జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, కొండికొప్పుల పద్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు

మధ్యాహ్న కార్మికుల నిరసన

ఆర్డీవో ఆఫీస్ ప్రాంగణంలో చేపట్టిన దీక్షల శిబిరంలో మధ్యాహ్న భోజన కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకై చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇన్నేళ్లుగా వెట్టిచాకిరికి గురవుతున్న వారికి ఆర్థికంగా.. ఉద్యోగ పరంగా భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే అందివ్వాలని కోరారు. మధ్యాహ్న కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మీస లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎస్. లక్ష్మి, సత్తయ్య, సావిత్రి, మల్లవ్వ, నర్సయ్య, మంజుల, రేణుక,కనుకలక్ష్మి తదితరులున్నారు.

భవన కార్మికులకు పనులు కల్పించాలి

భవన నిర్మాణ కార్మికులకు నిరంతం పనులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సిరిసిల్ల లేబర్ అడ్డావద్ద కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. కాయకష్టం చేసుకుని బతికే నిర్మాణ రంగ కార్మికులకు సిరిసిల్లలో ప్రతిరోజు పనులు దొరకక పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా నిర్మించే పనుల్లో భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

చేపలను ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ

- మత్స్యకారుల అభివృద్ధికి అండగా ప్రభుత్వం
- మిడ్‌మానేరులో చేప, రొయ్య పిల్లల విడుదలలో ఎమ్మెల్యే రవిశంకర్


చేప, రొయ్య పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

బోయినపల్లి: చేపలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయి వరకు రాష్ట్రం ఎదిగిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కొదురుపాక మిడ్ మానేరు ప్రాజెక్టు పరిసరాల్లో 28 లక్షల చేప, 28 లక్షల మేర రొయ్య పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రూపొందించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో జలాశయాలు, చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు చేరడంతో మత్స్య సంపద పెరిగిందన్నారు. రాష్ట్రంలో చేపలు, రొయ్యల ఉత్పత్తి పెరిగి మత్స్యకారులకు ఉపాధి లభిస్తోందని తెలిపారు. మత్స్యకారులకు వాహనాలు సైతం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్. వైస్‌ఎంపీపీ నాగయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి జీ. శివప్రసాద్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, కొనుకటి లచ్చిరెడ్డి, సంబ లక్ష్మీరాజం, జే.అంజన్‌రావు, నల్లగొండ అనీల్, కందుల గంగారెడ్డి, మత్స్యశాఖకు చెందిన కిరణ్ పాల్గొన్నారు.

సీఎస్సీ సేవలు ప్రారంభం


సేవలు ప్రారంభిస్తున్న బాపురావు

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలో పోతుగల్ పీఏసీఎస్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ మహాజనసభ చైర్మన్ తన్నీరు బాపురావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే పోతుగల్ సింగిల్‌విండో రైతులకు పది శాతం డివిడెండ్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 2022–23 గాను రూ.1.65 కోట్ల రైతుల షేర్ క్యాపిటల్ ఉందన్నారు. దీనిపై రైతులకు పదిశాతం అంటే రూ.10.65 లక్షలను రైతుల ఖాతాలో వేశామన్నారు. అలాగే 300 రకాల సేవలను అందించే సీఎస్‌సీని ప్రారంభించారు. డ్రోన్ ద్వారా రైతులకు సేవలను అందిస్తున్నామన్నారు. అంతకు ముందు జరిగిన చర్చల్లో ఎంపీపీ శరత్‌రావు, సర్పంచ్ గౌతంరావు తెర్లుమద్ది సర్పంచ్ కిషన్‌రావు రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బాపురావు, ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సర్పంచ్ వనజ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ నర్సయ్యయాదవ్, వైస్‌చైర్మన్ రాజేశంగౌడ్, సీఈవో కృష్ణ, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లటౌన్: మెప్మా రిసోర్స్‌పర్సన్లు తమ వేతనాల పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ ఆర్పీలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.4 వేల నుంచి రూ.6వేలకు సీఎం కేసీఆర్ పెంచారన్నారు. సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కేసీఆర్ చేపడుతున్న సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, మెప్మా ఆర్పీల యూనియన్ పట్టణ అధ్యక్షురాలు లలిత, గడ్డం లక్ష్మి, మానస, లత, విజయ పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

- దరఖాస్తులకు అక్టోబరు 7వ తేదీ గడువు
- సెట్విన్ జిల్లా కో ఆర్డినేటర్ అమీనా

సిరిసిల్ల: జిల్లాలోని భవన నిర్మాణ కార్మికుల కార్డు కలిగి ఉన్న కుటుంబాల్లోని మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నామని సెట్విన్ జిల్లా కో–ఆర్డినేటర్ అమీనా శనివారం తెలిపారు. మూడు నెలలపాటు శిక్షణను పూర్తిచేసిన వారికి ఉచితంగా కుట్టుమిషన్ అందిస్తామన్నారు. మహిళా అభ్యర్థులు కర్టెన్ల తయారీలో కుట్టు శిక్షణ పొందాల్సి ఉంటుందని చెప్పారు. అక్టోబరు 7లోగా కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులోని జిల్లా కార్మికశాఖ ఆఫీస్‌లో దరఖాస్తు చేయాలని కోరారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులుగా కనీసం 8 నెలల ముందు గుర్తింపుకార్డు ఉన్న 18–45 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. నిరుద్యోగులే ఈ శిక్షణకు అర్హులని, కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటో, లేబర్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యార్హతల జిరాక్స్ పత్రాలను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఎల్లారెడ్డిపేట: సమస్యల పరిష్కారానికి ఈ నెల 4న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన యుద్ధభేరీ బ్యానర్లు, కరపత్రాలను మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శులు అలువాల లక్ష్మణ్, గుమ్మడి కాంతయ్య, నజీర్ శనివారం ఆవిష్కరించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు శనివారం ప్రజాప్రతినిధులు చెక్కులు అందజేశారు. సర్పంచులు కస్తూరి లత, గనప శివజ్యోతి, మిట్టపల్లి లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోశాలలో పశువులకు పశుగ్రాసం అందించండి

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జై శ్రీకృష్ణ గోపాల గోశాలలో పశుగ్రాసం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. దాతలు ఫోన్ నంబర్ 9949151055 లో సంప్రదించాలన్నారు.

పౌరుల హక్కులు కాపాడాలి

బోయినపల్లి/కోనరావుపేట/వేములవాడరూరల్: జిల్లాలోని పలు గ్రామాల్లో అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. బోయినపల్లి మండలంలోని కొత్తపేట, కోనరావుపేట మండలంలోని జైసేవాలాల్ భుక్యారెడ్డి, కోనరావుపేట మండలం జైసేవాలాల్ భుక్యారెడ్డి తండాలో, కోనరావుపేట మండలం జైసేవాలాల్ భుక్యారెడ్డి తండా వీర్నపల్లి మండలం హౌసింగ్ నాయక్ తండాలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించా. అధికారులు, ప్రజాప్రతనిధులు, నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల సమ్మెకు ఎంపీడీవో సంఘీభావం

ఎల్లారెడ్డిపేట: కంప్యూటర్ ఆపరేటర్లు జిల్లా కేంద్రంలో చేపట్టిన శాంతియుత సమ్మెకు ఎంపీడీవో చిరంజీవి శనివారం సంఘీభావం తెలిపారు.

బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా

కోనరావుపేట: మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎల్లాల లింగారెడ్డి పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. గ్రామానికి చెందిన లింగారెడ్డి మండల పార్టీలో ప్రచారకార్యదర్శిగా, చురుకైన నాయకునిగా పని చేశారు. తన వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేసినట్లు, ఈ మేరకు జిల్లా అధ్యక్షునికి లేఖ పంపినట్లు పేర్కొన్నాడు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

కోనరావుపేట: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజనకార్మికులు చేస్తున్న సమ్మెకు కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ మద్దతు ప్రకటించారు. వారితో కలిసి బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

కోనరావుపేట: మండలం మామిడిపల్లిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని వృద్ధులకు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, నాయకులు సాసాల మల్లారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలో వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ దివ్య శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారిని పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అశవర్కర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎడ్ల లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

ఉర్సు ఉత్సవాలకు ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పాపయ్య పటేల్ బంగ్లా సమీపంలో ఉన్న హిమాం హాలీ హంజ దర్గా ఉర్సు ఉత్సవాల నిర్వహణకు తన వంతుగా సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నెహ్రూనగర్, వెంకట్రావునగర్, సుభాష్‌నగర్, సాయినగర్, గోపాల్‌నగర్, బీవైనగర్, శివనగర్, పెద్దూరు, కొత్త బస్టాండ్, ఇందిరానగర్ తదితరల ప్రాంతాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గొడవలకు దిగిన వ్యక్తులపై కేసు నమోదు

కోనరావుపేట: మండలం నిజామాబాద్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా స్నేహమిత్ర యూత్, రాజన్న యూత్‌లకు చెందిన యువకులు మద్యం మత్తులో చిన్న చిన్న కారణాలతో గొడవలకు దిగి భయభ్రాంతులకు గురిచేసే విధంగా ప్రవర్తించిన యువకులపై కేసు నమోదు చేశామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఇరువర్గాలకు చెందిన తాళ్లపెల్లి ప్రశాంత్, ఉప్పుల పర్శరాములు, సుమన్, ఈర్ల తిరుపతి, బాబు, ముష్కం రాజు, గొర్రె బాబు, బంటు మహేశ్, సింగం రాకేష్, ఊరడి మధు, వంగపెల్లి అజయ్, వినోద్, దుర్గం నవీన్, అరుణ్, శ్రీనివాస్, వినీత్, నేనర్ల శేఖర్, బర్మ భరత్, గోషిక మధులతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చక్కెరలో యూరియా !

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం అగ్రహారంలో ఓ వ్యక్తి కొబ్బరి కుడుకలకు చక్కెర అంటూ అమ్ముతుండగా గ్రామస్తులు పట్టుకొని పరిశీలించారు. యూరియా కలిపి అమ్ముతున్నాడని గుర్తించి నిలదీశారు. ఇలాంటి తప్పుడు పనిచేసి మోసం చేయడం సరికాదని గ్రామస్తులు హెచ్చరించారు. దీంతో సదరు వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ వీడియో శనివారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

మంత్ర జపయజ్ఞం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సత్సంగ సదనంలో నవంబర్ 14 వరకు శివ మంత్ర జపయజ్ఞం నిర్వహిస్తున్నట్లు సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి తెలిపారు. సత్సంగ సదనంలో శనివారం మాట్లాడారు. నవంబర్ 14న వేములవాడలోని సత్సంగ సదనంలో నిర్వహించే యజ్ఞంలో పాల్గొనాలని భక్తులను కోరారు.

నా నేల-నా దేశం ర్యాలీ

సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలో శనివారం పోస్టాఫీస్ సిబ్బంది నా నేల–నా దేశం ర్యాలీ నిర్వహించారు. సిరిసిల్ల పోస్ట్‌మాస్టర్ రామచంద్రం, శ్రీనివాస్, రమేశ్, కొండయ్య, శ్రావణ్ పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

సిరిసిల్ల: జిల్లాలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ముస్తాబాద్‌లో 62.8 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 49.0, చందుర్తిలో 18.6, వేములవాడ రూరల్‌లో 17.4, బోయినపల్లిలో 44.5, వేములవాడలో 10.9, సిరిసిల్లలో 34.5, కోనరావుపేటలో 27.2, వీర్నపల్లిలో 60.6, ఎల్లారెడ్డిపేటలో 54.0, గంభీరావుపేటలో 45.9, తంగళ్లపల్లిలో 21.4, ఇల్లంతకుంటలో 11.0 మిల్లీమీటర్ల వర్షం నమోదైందని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసచార్యులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 35.2 మిల్లీమీటర్లుగా నమోదైంది.

విద్య, వైద్య రంగాలపై దృష్టి


యువకులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

బోయినపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ విద్య, వైద్య రంగాలపై దృష్టి పెడతారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వేములవాడ నుంచి కరీంనగర్ వెళ్తున్న క్రమంలో మండలంలోని వెంకట్రావుపల్లి హోటల్ వద్ద ఆగి కార్యకర్తలతో ముచ్చటించారు. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కత్తెరపాక కొడయ్య, సర్పంచు బూర్గుల నందయ్య, వైస్ ఎంపీపీ నాగయ్య, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కట్ట గోవర్దన్ పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు చీరెలు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని చీకొడు గ్రామంలో నిరుపేద మహిళలకు చిట్నేని వెంకటేశ్వర్‌రావు, మాధవి దంపతులు చీరెలను శనివారం పంపిణీ చేశారు.

అసదుద్దీన్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్/జముస్తాబాద్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ ఇంటిపై ఎంఐఎం కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా శనివారం ఆందోళనలు చేపచట్టారు. శనివారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ నేతృత్వంలో అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంఐఎం ఇటువంటి చర్యలకు మరోసారి పాల్పడితే సహించబోమన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మండలశాఖ అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి, గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, సెస్ మండల మాజీ డైరెక్టర్ కొక్కు దేవేందర్‌యాదవ్, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్ పార్టీ


గ్యారెంటీ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో ఆత్మవిశ్వాసం కలిగిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని భీమునిమల్లారెడ్డిపేటలో శనివారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వరంగల్ డిక్లరేషన్ అమలు చేసి రైతు, యువత, దళితులు, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. రూ.4 వేల పెన్షన్, రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, అర్హులైన రైతులకు రుణాలు, రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షల సాయం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు హమీద్, బ్లాక్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, గ్రామశాఖ అధ్యక్షులు సతీష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని దేశాయిపేట, రాజుపేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చీటి ఉమేష్‌రావు గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

ఇంటింటా గ్యారంటీ కార్డుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం, నారాయణపూర్, కోరుట్లపేట, అక్కపల్లి, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జిలు గంట బుచ్చాగౌడ్, కొత్తపల్లి దేవయ్య, దేవానందం, గఫర్ గ్యారెంటీ కార్డులను (ఇంటింటా)గడపగడపకు పంపిణీ చేశారు.

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లిలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి శనివారం నిర్వహించారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు


భూమేశ్వర్(ఫైల్)

రుద్రంగి: మండల కేంద్రానికి చెందిన చిట్టపురం భూమేశ్వర్(49) అనే వ్యక్తి ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా గల్ఫ్ దేశం వెళుతున్నాడు. కుటుంబ సభ్యులను చూసేందుకు సంవత్సరం ఇంటికి వచ్చి తిరిగి కువైట్ వెళ్లాడు. కొద్ది రోజులకే అనారోగ్యం బారిన పడి నెల రోజుల క్రితం కువైట్ ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటుండగా, ఈ నెల 20న పరిస్థితి విషమించి భూమేశ్వర్ మృతి చెందినట్లు అతను పని చేసే కంపెనీ నుంచి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం రాత్రి మృతదేహం స్వగ్రామం చేరడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. ఉన్న ఊరిలో ఉపాధి లేక అప్పులు చేసి గల్ఫ్ వెళ్లి చేసిన అప్పులు తీర్చడంతో పాటు కుటుంబాన్ని పోషించుకుంటాడనుకుని, క్షేమంగా ఇంటికి తిరిగి వస్తాడు అనుకున్న భర్త చనిపోయాడని తెలిసి భార్య లావణ్య, తల్లి గంగవ్వ రోధించిన తీరు పలువురిని కంట తడి పెట్టించింది. మృతుడికి ముగ్గురు పిల్లలు కాగా అందులో ఒకరు వికలాంగుడు. గల్ఫ్‌లో మృతి చెందిన నిరుపేద చిట్టపురం భూమేశ్వర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో గణేశ నిమజ్జనం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన పోలీసులను శనివారం మండపాల నిర్వహకులు సన్మానించారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్‌తో పాటు సిబ్బందిని సత్కరించారు.

పాత సామగ్రి వేలం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో అక్టోబర్ 10న పాత సామగ్రిని వేలం వేయనున్నట్లు బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 87126 57570, 87125 97278 నెంబర్లని సంప్రదించాలన్నారు.